ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-10.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హైదరాబాద్ లో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ మూడు రోజుల సదస్సు - 'జీటో కనెక్ట్' ను కొద్ది సేపటి క్రితం ప్రారంభించారు.

2. సికింద్రాబాద్ - ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద 52 కోట్లతో నిర్మించిన సమాంతర ఆర్‌ఓబీని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

3. దసరా వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లోని తన నివాసంలో ఈ ఉదయం దసరా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

4. ఈరోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఈదురు గాలులు , ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది. రాష్ట్ర మంతటికీ పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**EARLY-JITO CONNECT EVENT**

రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హైదరాబాద్ లో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ మూడు రోజుల సదస్సు - 'జీటో కనెక్ట్ ' ను ప్రారంభించారు. రెండేళ్ళకోసారి ఏర్పాటయ్యే ఈ సదస్సును నగరంలోని హై టెక్స్ లో ఏర్పాటుచేయగా ఇందులో దాదాపు వెయ్యి బిజినెస్ స్టాల్స్ తో ఎక్సిబిషన్ ను కూడా ఏర్పాటు చేశారు. ఈ మధ్యాహ్నం రక్షణ మంత్రి బేగమ్పేట్ విమానాశ్రాం నుంచి తిరిగి వెళతారు. అంతకు ముందు , ప్రత్యేక విమానంలో బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకున్న రక్షణమంత్రికి రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, BJP రాష్ట్ర అధ్యక్షులు N రామచంద్ర రావు ఘనంగా స్వాగతం పలికారు.

----------MSL

**ఓవర్ బ్రిడ్జ్:**

హైదరాబాద్ లోని ఫలక్‌నుమా వద్ద 52 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన సమాంతర రోడ్ ఓవర్ బ్రిడ్జ్ ను ఈ ఉదయం హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సికింద్రాబాద్ - ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్ పై ఉన్న ఆర్‌ఓబీకి సమాంతరంగా GHMC ఈ ROB ని నిర్మించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాతబస్తీ ఫలక్ నామాలో ఈరోజు నుంచి ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తీరుతాయన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ , మీర్జా రహమత్ బేగ్ , ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్ , మీర్ జల్ఫికర్ అలీ సహా పలువురు ప్రజా ప్రతినిధులు , GHMC కమిషనర్ ఆర్వీ కర్ణన్ హాజరయ్యారు.

----MSL

**దసరా ఉత్సవాలు**

రాష్ట్ర వ్యాప్తంగా దసరా వేడుకలు నిన్న భక్తి శ్రద్ధలతో జరిగాయి. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు.. రాష్ట్ర మంతటా ఉత్సవాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శమీ వృక్షానికి పూజలు చేసి శమీ పత్రాలు ఇచ్చి పుచ్చుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తెలంగాణా ప్రభుత్వం పండుగలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్న దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జనగామ లోని బతుకమ్మ కుంటలో ఏర్పాటు చేసిన రావణాసురవధలో స్థానిక శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. పలు మండలాల్లో నవరాత్రుల పాటు పూజలు నిర్వహించిన దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ,

నియమ నిష్ఠలతో , ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ దసరా అని నిర్మల్ లో జరిగిన వేడుకల్లో బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు.

వరంగల్, జనగామ, రాజన్న సిరిసిల్ల , నిర్మల్

**రేవంత్ కొడంగల్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా, కొడంగల్ లో తమ నివాసంలో దసరా సందర్భంగా ఈ ఉదయం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి సహా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు , స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ రేవంత్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.
పీఎన్

**దసరా కిషన్ రెడ్డి**

హైదరాబాద్ లోని, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో దసరా సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి , మాజీ ఎంపీ వి. హనుమంతరావు , స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.విజయానికి ప్రతీక అయిన జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు.

పీఎన్

**SITHARAMAN-KAUTILYA CONCLAVE**

వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి 8 శాతం జిడిపి వృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన కౌటిల్య ఆర్థిక సదస్సు ప్రారంభోత్సవంలో సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచం సవాళ్లు ఎదుర్కొంటున్న ఈ సమయంలో భారతదేశ వృద్ధి స్వదేశీ అంశాలపై

ఆధారపడి ఉందని, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం భారత్ కు ఉందని , సీతారామన్ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని చెప్తూ ఆర్థిక మంత్రి... భారత్ స్థిరమైన ఆర్థిక వృద్ధిని కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

NSD

**అలాయ్ భాలాయ్:**

దసరా పండుగను పురస్కరించుకుని ఏటా హైదరాబాద్ లో నిర్వహించే ఆలాయ్ భాలాయ్ – కార్యక్రమం ఈఉదయం వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఆలాయ్ భాలాయ్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి M వెంకయ్య నాయుడు, రాష్ట్ర గవర్నర్ జీష్ణు దేవ్ వర్మ , కేంద్ర మంత్రి రాజున్ మెఘ్వాల్ , తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండ్ ( GoC) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ Ch విద్యాసాగర్ రావు, వివిధ పార్టీల నాయకులు, సినీ సాహిత్య రంగ ప్రముఖులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, దేశంలో భిన్న సంస్కృతులు, వేష భాషలూ ఉన్నప్పటికీ దేశ ప్రజలంతా ఒక్కటన్న స్ఫూర్తిని ఈ కార్యక్రమం అందిస్తుందని చెప్పారు. కాగా, ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

-----MSL

<u>**బ్రేక్**</u>

**జీఎస్టీ ఫిర్యాదులు**

జీఎస్టీ 2.0 పై ఏర్పాటుచేసిన జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్‌కు ఇప్పటివరకు 3వేల 981 కాల్స్ వచ్చాయని కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. వీటిలో 31శాతం జీఎస్టీ సంబంధిత ప్రశ్నలు ఉండగా , 69 శాతం ఫిర్యాదులకు సంబంధించిన కాల్స్ వచ్చాయని వెల్లడించింది.

వీటిలో పాల ధరకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయని , ఆ తర్వాత స్థానం ఎలక్ట్రానిక్ వస్తువులు, LPG, పెట్రోల్ కు సంబంధించినవి ఉన్నాయని వివరించింది.

డెస్క్

**వరల్డ్ స్మైల్ డే**

ఈరోజు వరల్డ్ స్మైల్ డే (ప్రపంచ చిరునవ్వు దినోత్సవం). ప్రతి సంవత్సరం అక్టోబర్ మొదటి శుక్రవారం నాడు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. హార్వే బాల్ రూపొందించిన స్మైలీ ఫేస్ అసలు ఉద్దేశ్యాన్ని ప్రోత్సహించడానికి ఇది అంకితం చేయబడింది. 1963లో ఈ ఐకానిక్ స్మైలీ ఫేస్ ను సృష్టించిన హార్వే బాల్ , ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. ప్రజలను దయగల చర్యలకు ఉసిగొల్పడానికి, ఒకరినొకరు నవ్వించడానికి ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం.

డెస్క్

**సిరిసిల్ల గరీబ్ కల్యాణ్ యోజన**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు తమలాంటి వాళ్లకు మేలు చేస్తున్నాయని , రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దురిశెట్టి శ్రవణ్ కుమార్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**సౌండ్ బైట్ ... దురిశెట్టి శ్రవణ్ కుమార్**

పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**వాతావరణం**

ఈరోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఈదురు గాలులు , ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

రేపు కూడా రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉంటుందని తెలియజేసింది. ఈమేరకు రాష్ట్రమంతటికీ పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. మరోవైపు , బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరం దాటినట్లు విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు.

పీఎస్

**నల్గొండ సాగర్**

కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నాగార్జునసాగర్ కు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. వరద నీరు వస్తుండటంతో అధికారులు 22 క్రస్టు గేట్ల ద్వారా లక్ష 70 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల సాగునీటి అవసరాల కోసం కుడి ఎడమ కాలువల ద్వారా 18 వేల క్యూసెక్కులు , ప్రధాన విద్యుత్ కేంద్రంలో విద్యుత్పత్తి ద్వారా మరో 33 వేల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు.

పీటీసీ, నల్గొండ

**వరంగల్ ఆయుధపూజ**

విజయదశమి సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఆయుధ పూజ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆయుధ భాండాగారం వద్ద, యంటి విభాగంలో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలోని శమీ వృక్షానికి పూజలు చేసి. అధికారులు, సిబ్బంది కి శమీపత్రాలతొ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.

పీటీసీ, వరంగల్

**భద్రాద్రి ఉత్సవాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. నిన్న సాయంత్రం దసరా మండపంలో శమీ పూజ , శ్రీరామ లీలోత్సవం కార్యక్రమాలతో విజయదశమి వేడుకలు పూర్తయ్యాయి. దసరా మండపంలో రావణ వధ కార్యక్రమాన్ని ఆలయ ఈవో దామోదరరావు పర్యవేక్షించారు. రామవరంలో జరిగిన జమ్మి పూజ , రావణాసుర వధ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**వేములవాడ కోడెమొక్కులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో భక్తులు ఇకపై భీమేశ్వర స్వామి ఆలయంలో కోడె మొక్కులు చెల్లించాలని ఆలయ ఈవో రమాదేవి చెప్పారు. ఇందులో భాగంగా ఆలయ స్థానాచార్యులు చంద్రగిరి శరత్ శర్మ ఆధ్వర్యంలో దసరా పర్వదినం సందర్భంగా కోడె మొక్కుల స్తంభానికి ప్రతిష్టాపన చేశారు.

పీటీసీ, సిరిసిల్ల

**ఉస్మానియా ప్రారంభం**

హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనాల నిర్మాణ పనులు గోషామహల్ స్టేడియంలో దసరా పర్వదినం సందర్భంగా నిన్న ప్రారంభమయ్యాయి. 26 ఎకరాల విస్తీర్ణంలో 12 అంతస్తులతో, 2 వేల పడకలతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త భవనం నిర్మిస్తున్నారు.

డెస్క్

**ఆసిఫాబాద్ నిమజ్జనం**

శరన్నవరాత్రుల చివరి రోజైన ఈరోజు ఆసిఫాబాద్ జిల్లాలో దేవి నిమజ్జోత్సవానికి సర్వం సిద్ధమైంది. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కాంతిలాల్ పాటిల్ , ఏఎస్పీ చిత్తరంజన్ ఆసిఫాబాద్, కాగజ్ నగర్ లలో నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పీటీసీ ఆసిఫాబాద్

**గేమింగ్ బిల్ ఒపీనియన్**

ఆన్‌లైన్ గేమింగ్ నియమాల ప్రమోషన్ , నియంత్రణ, 2025 బిల్లు ముసాయిదాపై కేంద్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని ఆహ్వానించింది. ఈనెల 31వ తేదీ లోపు ogrules.consultation@meity.gov.in కు ఇ -మెయిల్ ద్వారా అభిప్రాయాలు , వ్యాఖ్యలను పంపించాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

పీఎన్